# అమర జీవులు

వాసా భక్తుల

ప్రాల్ మియాన్, మరాటాబాన్, తాటాన్, చియాంగ్ మాయ్ మొదలగు పట్నాలను జపానువారు వశపరచుకొని వారి జండాను ఎగురవేసారు. పెగూయోమా పర్వతముల అవలనున్న జపానువారికీ, ఈవలనున్న భారతీయులకు జరిగిన యుద్ధంలో భారతీయులను బ్రిటిష్ వారు యుద్ధరంగంలోని మొదటి వరుసలో నుంచారు. భారత సైనికులు రాత్రనక, పగలనక శత్రువులపై బాంబులు కురిపిస్తున్నారు. ఒక్కొక్క రోజుని మిలిటరీ యూనిట్లనుండి ఆహారము వచ్చుటే కష్టతరముగ నున్నప్పటికీ, నిరాశకు తమ హృదయములలో తావివ్వకుండా, అడుగు అడుగునా శత్రువులను ఎదిరించి తమయుద్ధ ప్రవీణతను తెలియజేస్తూ శత్రువులను పెగూయోమా పర్వతములను దాటి రాకుండా యుద్ధం సాగిస్తున్నారు భారత సైనికులు. నిముషనిముషానికీ శబ్దాలు, ఫిరంగి మోతలు, తుపాకి కాల్పులతో రాత్రింబగళ్ళు వరుసగా ఎనిమిది దినములు జరిగిన తీవ్రయుద్ధ ఫలితం: శత్రు సైనికులు అనేకమంది బంధింపబడ్డారు. సుమారు ఒకలక్ష డాలర్లు విలువగల ఆయుధసామగ్రి భారత సైనికుల వశమయింది. భారత సైన్యాలను ముఖాముఖి నెదిరించి రంగూన్ పట్టణమును స్వాధీనపరచుకొనుట దుర్లభమని జపానువారు గ్రహించారు. మరునాడు యుద్ధము జరుగలేదు. జపానువారి ఆచోకీ తెలిసికొనుటకై వెల్లిన గూఢచారులు తిరిగి రానందువల్ల జపానువారిచే బంధింపబడియుందురని భారత సైనికులు నిశ్చయించుకున్నారు.

ఆనాటి రాత్రి—రి గంటలకు—

శత్రువుల ఆచోకీ తెలుసుకొనుటకు భారత "కనూజ్" దళమునుండి రంజిత్, శంకర్ అను ఇద్దరు సిపాయిలు కాలినడకన బయలుదేరారు. ఆ చీకటిలో కొండలలో కాళ్ళకు రాళ్లు తగిలి రక్తం కారుతూ ఉన్నప్పటికీ బాధకు లొంగకుండా పన్నెండుగంటల పైముగువరకూ నడుస్తూనేయున్నారు. కానీ శత్రువుల ఆచోకీ ఏమాత్రం తెలియలేదు. ఇంకా ముందుకువెళ్ళినచో శత్రువుల ఆచోకీ దొరుకునను ఆశయున్నప్పటికీ, తెల్లవారేలోపున భారతసైన్య స్థావరములను చేరుకొనలేకపోయినచో శత్రువుల చేజిక్కెదమను తలంపు కలుగుటవల్ల వెనకకు మరలిపోవుటకు నిశ్చయించుకొన్నారు. ఇంతలో సుమారు రెండూ, లేక మూడు మీటర్ల దూరములో ఒక వ్యక్తి అగ్గిపుల్ల వెలిగించి సిగరెట్టు ముట్టించుకొనుట - మన సిపాయిలు చూచారు. అగ్గిపుల్ల వెలుగులో ఆ వ్యక్తి ముఖము సరిగా కనబడనందువల్ల శత్రు సిపాయి అని తలంచి, అతనిని వెంబడించినచో శత్రుస్థావరములను తెలిసికొనుట సులభమని గ్రహించి, అతనిని హతమార్చకుండా మన సిపాయిలు వెంబడించ ప్రారంభించారు. ఈ విధముగా సిపాయిని వెంబడిస్తూ సుమారు నాల్గు లేక అయిదుమైళ్ళ దూరం నడచి శత్రు స్థావరములను చేరారు. ఆ స్థావరములచుట్టూ సిపాయిలు పహారా యిస్తున్నారు. రంజిత్ శంకర్‌లు వెంబడించిన వ్యక్తి ఒక గూడారములోనికి వెళ్ళటం చూచి, పహారానిచ్చు సైనికుల కంటబడకుండా వెళ్ళి ఆ గూడారము వెనుక దాగుకొన్నారు.

ఆ గూడారములో జరిగిన సంభాషణ :-

1వ వ్యక్తి:—మీ సైన్యదళాలు ఎన్ని? ఒక్కొక్క దళములోని సైనికసంఖ్య ఎంత?

2వ వ్యక్తి:—పెగూయోమా పర్వతము దగ్గిర మూడు దళములున్నవి. ఫ్లవర్ దళానికి

1100 సైనికులూ, మీసార్ దళానికి 1500 సైనికులూ, కనూజ్ దళానికి 909 సైనికులూ యున్నారు. మీవద్ద యుద్ధసామగ్రి చాలినంత యున్నదా ?

1 వ వ్యక్తి;—మా వద్దనున్న ఆ యుద్ధ సామగ్రి చాలవరకూ నిన్న జరిగిన యుద్ధంలో మీ వశమయింది. ఇప్పుడు యుద్ధ సామగ్రి, ఆహారముగూడా చాలినంత లేదు.

2 వ వ్యక్తి;—అయితే మీకు యుద్ధసామగ్రి ఆహారము ఎప్పటికి చేరుతుంది ?

1 వ వ్యక్తి;—రేపురాత్రి ఎనిమిదీ లేక తొమ్మిది గంటలకుగానీ చేరదు. చేరుటతోడనే అకస్మాత్తుగా వచ్చి మీ సైన్యములను ముట్టడిస్తాం. మా ఆచోకీ తెలిసికొనుటకై వచ్చిన మీ గూఢచారులను మేం బంధించాం. రేపురాత్రి జరుగలోపు యుద్ధంలో నీవు మాకు ఆయుధ సామగ్రి ఇవ్వాలి.

2 వ వ్యక్తి;—సరే! వీలయినచో ఇచ్చెదను. ఇంక నేను వెళతాను. తెల్లవారే లోపున మా స్థావరాలను చేరుకోవాలి.

ఇంక ఏ విధమైన సంభాషణ జరగలేదు. రంజిత్, శంకర్‌లు వెంబడించిన వ్యక్తి హావల్దార్ రామన్ అని తెలిసికొన్నారు, రంజిత్, శంకర్‌లు మరల పహారానిచ్చు సైనికుల కంటబడకుండా రామన్‌ను వెంబడిస్తూ దాదాపు ఎనిమిదిమైళ్ళ దూరం నడచిన తరువాత రామన్‌ను బంధించి, అతనితో తెల్లవారుసరికి సైనికస్థావరములు చేరి, మరునాడు రాత్రి అకస్మాత్తుగావచ్చి భారత సైన్యములను ముట్టడించుటకు శత్రువులు యుద్ధ సన్నాహములు చేస్తున్నట్లు కెప్టెనుఅయిన లాబ్సు దొరతో చెప్పారు. హావల్దారు రామన్ శత్రువులతో కలియుటకు కారణం తెలిసికొనుటకై రంజిత్ రామన్ వద్దకు వెళ్ళి ఇలాగన్నాడు.

"దుర్మార్గుడా! నీవు భారత సైన్యములో హావల్దారుగా యుండికూడా శత్రువులకు మన రహస్యములు చెపుతున్నావా?"

"అవును. నేను శత్రువులకు రహస్యములు చెబుతున్నాను నా ఉద్దేశ్యము మంచిదే"

"ఆ మంచి ఉద్దేశ్యం ఏమిటి?" అని ప్రశ్నించాడు రంజిత్ ఆశ్చర్యంతో. అపుడు రామన్ ఇలా అన్నాడు. "బ్రిటిషువారు మన దేశాన్ని వశపరచుకొని మనలను బానిసలుగా చేసారు. మనదేశ రహస్యములను జపానువారికి తెలియజేసినట్లయితే, వారు బ్రిటిషువారిని ఓడిస్తారు. అంతటితో భారత దేశాన్ని వదలి వెళ్ళిపోతారు బ్రిటిషువారు. భారతమాత స్వతంత్రురాలవుతుంది."

'భారత మాతను స్వతంత్రురాలిగా చేయదలచావు. యీ వుద్దేశ్యం మంచిదే. కానీ శత్రువులైన జపానువారికి సహాయముచేసి భారతమాతను మానవ రాక్షసులగు జపానువారి చేతుల్లో పెట్టదలిచావు. జపానువారికి మన దేశ రహస్యములను చెప్పి, వారికి సహాయము చేసినందువల్ల వారు బ్రిటిషువారిని ఓడించవచ్చు. బ్రిటిషువారిని దేశం నుంచి వెళ్ళగొట్టవచ్చు. కానీ జపానువారు మన దేశాన్ని వదలి వెళతారా? భారతమాత కన్నబిడ్డలలో దేశద్రోహులుండబట్టే ఇంతవరకూ స్వతంత్రురాలు కాలేకపోయింది. దేశస్వాతంత్రం కోసం స్త్రీలు సైతమూ యుద్ధముల చేస్తున్నారు" అని జపాను నా దేశంలో కాలుపెడితే కత్తి పుచ్చుకుని వెళతానని కాంగ్రెసు అధ్యక్షుడు మౌలనా ఆజాద్ ప్రకటన తీసి చూపించాడు.

"ఆగు. రజిత్, నాతప్పు నేను తెలిసికొన్నాను. జపానువారికి సహాయము చేసి భారత మాతను స్వాతంత్రురాలిగా చేయదలచాను. కానీ భారత మాతను మరల జపానువారి చేతుల్లో పెట్టబోతున్నట్లు తెలిసికొనలేక పోయాను. నా ఉద్దేశ్యము మంచి దయినప్పటికీ నేను దేశద్రోహినే. నన్ను నిలువునా కాల్చి చంపు. కన్న మాతకు ద్రోహము చేయదలపెట్టిన నేను మీరు విధించు ఏ శిక్ష కయిననూ అర్హుడనే. ఊ... చంపు"

"రామన్ నీవు చేసిన తప్పు నీవు తెలిసికొనినందులకు నిన్ను వదిలేస్తున్నాము. యీ వేళ మనం తుపాకులు పట్టుకుని యుద్ధం చేస్తున్నాము ధైర్య సాహసాలుతో పోరాడుతున్నాము. ఈ యుద్ధం పూర్తి అయినాక బ్రిటిష్‌వారు మనల్ని బానిస

లుగా ఉంచలేరు. అథవా అలాగ ఉంచడానికి ప్రయత్నించారా ఈ తుపాకి గుళ్ళతోనే వాళ్ళని గెంటికొస్తాము”

“రంజిత్! యికనుంచి శత్రువులను హతమార్చుస్తాను. నాకంఠంలో ప్రాణం ఉన్నంతవరకు శత్రువులు పెగూ యోమాపర్వతమును దాటి లోనికి ప్రవేశింపలేరు. మనం యీ తక్షణం వెళ్ళి శత్రువులను ఎదిరిద్దాం. యీ రోజు రాత్రి గానీ వారికి యుద్ధసామగ్రి రాదు! ఇదే మంచి సమయం. బయలుదేరుదాం పదండి” అన్నాడు రామన్.

ఉదయం తొమ్మిది గంటల సమయం. భారత సైనికులు జపానువారిని ముట్టడించుటకు బయలుదేరారు. ఆకాశాన్ని నల్లటి మేఘములావరించాయి. తళుక్కు, తళుక్కుమని మెరుస్తున్నాయి మెరుపులు. ఫర్లాంగు ఫర్లాంగునకూ కందకములు త్రవ్వుకొంటూ సాయంకాలం నాలుగు గంటలు పైమగు సరికి శత్రుస్థావరముల సమీపానికి వెళ్ళారు. వానగూడా కురియటం ప్రారంభించింది. జపానువారిపై ఒక్కుమ్మడిగా దాడిచెయ్యడం ప్రారంభించి శత్రువులను అనేకమందిని హతమారుస్తున్నారు. ఇంతలో జపానువారికి కొత్తసైన్యములు వచ్చుచున్నట్లు గూఢచారుల వల్ల భారత సైనికులకు తెలిసింది. శత్రువులను దారిలోనే ఎదిరించుటకై రంజిత్ కొంత సైన్యమునూ, శంకర్ కొంత సైన్యమునూ, రామన్ కొంత సైన్యమును వెంటనిడుకొని బయలుదేరారు; చీకటి పడింది. వాన ఇంకా కురుస్తూనే ఉంది శత్రువులను దారిలోనే ఎదుర్కొన్నారు. వీరి సైనికుల సంఖ్య అరువందలకు మించిలేదు. కానీ శత్రువుల సైన్యసంఖ్య వెయ్యిమందికి పైగాయున్నది. భారత సైనికులు తక్కువయినప్పటికీ ధైర్యమును విడువక యుద్ధం చేస్తూనే యున్నారు. తెల్లవారింది. రంజిత్, శంకర్, రామన్‌ల దళములకు యుద్ధసామాగ్రి అయిపోయింది. కెప్టెను లాబ్బూ మిలిటరీయూనిట్లనుండి ఉన్న సామాగ్రిపంపుతానన్నాడు కానీ వీరికి అందలేదు. రంజిత్, శంకర్, రామన్‌లు అరువదిమంది సైనికులతో జపానువారిచే పట్టుబడ్డారు. వీరికి జరిగిన యుద్ధంలో తగిలిన గాయములనుండి రక్తం కారుతునే ఉన్నప్పటికీ వీరిముఖములో శౌర్యం ప్రకాశిస్తూనే యుంది. జపాను సైనికుల కెప్టెను అగు “చీదన్” ఆజ్ఞ ప్రకారం వీరిముగ్గురూ బంధింపబడి ఒక ఖాళీప్రదేశములో నిలబెట్టబడ్డారు.

రడీ...మార్చ్ - అన్... లెఫ్ట్ - రైట్... లెఫ్ట్ - రైట్... అని ఆజ్ఞాపించాడు నలభైమంది జపాను సైనికులు తుపాకులను తీసికొని మార్చి చేస్తున్నారు. చీదాన్, కొన్ని నిముషముల అనంతరం “హాల్ట్” అని అరచాడు నలుబది మంది సైనికులూ ఆగారు.

“ఎబౌట్టరన్” అన్నాడు చీదాన్.

సైనికులు రంజిత్, శంకర్, రామన్‌లవైపుకు తిరిగి నిలబడ్డారు.

“బీ - రడీ” అని హెచ్చరించాడు కెప్టెను చీదాన్.

రంజిత్, శంకర్, రామన్‌లవైపుకు తుపాకులను బారుచేసి నిలబడ్డారు సైనికులు. అప్పుడు కెప్టెన్ చీదాన్ ఇలా అన్నాడు.

“ఓ జపాను సైనికులారా! మనలను మార్గములో ఎదిరించి, మన సైనికులను హతమార్చిన యీ సేనా నాయకులకు బహుమతులు ఇస్తున్నాను. అందరూ ఇటు చూడండి.”

“షూట్”

బంధింపబడిన రంజిత్, శంకర్, రామన్‌లపై చీదాన్ నోటినుండి “షూట్” అను మాట లువచ్చుట తడవుగా, కనురెప్ప పాటులో నలుబది తుపాకీలు ఒక్క సారిగా ప్రేలాయి. వారి దుస్తులు రక్తమయమయినాయి. మూడునిముషముల అనంతరం వారి శిరస్సులు వాలిపోయాయి. దేశరక్షణ కోసం జపానువారిని ఎదిరించి, యుద్ధసామాగ్రిముగిసినందువల్ల బంధింపబడి, వారిదురాగ్రహానికీ, పశుత్వానికీ బలియై అమరత్వమునొందిన యుద్ధ వీరులగు రంజిత్ శంకర్ రామన్‌లు యీనాటికీ అమరజీవులే కదా!